
సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 5 । మార్చి । 2023



లెక్కల చిక్కులు తేలుస్తూ..

గణిత బోధనలో మాస్టారు రాణిస్తున్నారు. గణిత అవధానాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

- 8లో



సిక్కోలు యువకుడి ఆత్మహత్య

మలేషియాలో సిక్కోలు యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడు నరసన్నపేట మండలం బాలసీమకు చెందిన వాడు.

- 8లో

15 నుంచి డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫ్లియేషన్ కళాశాలల డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీలో వివరాలు శనివారం వెల్లడించారు. 28వ తేదీ వరకు 64 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు 15 నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

న్యూస్‌రీల్

అపరాల కొనుగోలుకు సిద్ధం: జేసీ


జేసీ ఎం నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో రైతులు పండించిన అపరాల పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్కెఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రబీ 2022–23 సీజన్‌లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. క్వింటా మినుములకు రూ.6600, క్వింటా పెసలకు రూ.7755గా మద్దతు ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేయించుకున్న రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించేందుకు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

'ఫలితాల విడుదలలో జాప్యం వద్దు'


దయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న పరీక్ష ఫలితాల విడుదలలో జాప్యం వద్దని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో శనివారం డయల్ యువర్ వర్సిటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల నుంచి వచ్చిన సమస్యలపై సమీక్షించారు. డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ పరీక్ష నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న స్పాట్ వాల్యుయేషన్ బిల్లులు చెల్లించాలని, వర్సిటీ పరిధిలో బీఎడ్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించటం లేదని ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు స్పందిస్తూ ఏటా స్పెషల్ డ్రైవ్ పరీక్షలు సాధ్యం కాదని, ఇప్పటికే నిబంధనలు పాటించని కారణంగా ఏడు బీఎడ్ కళాశాలలు ప్రవేశాలు నిలిపివేశామని, అధ్యాపకుల నుంచి బిల్లులు సకాలంలో రాకపోవటం వల్ల వాల్యుయేషన్ రెమ్యునరేషన్ చెల్లింపులో జాప్యం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, సీడీసీ డీన్ పీలా సుజాత, ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, డీన్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

19న రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు


బాడీబిల్డింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మార్చి 19న నిర్వహించనున్న 25వ రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు వరుసగా సిక్కోలులో తొమ్మిది రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి పదోసారి నిర్వహించేందుకు సిద్ధమవుతుండడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఏపీ బాడీబిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మార్చి 19న శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్ –2023 పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.1,15,000 నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 350 మంది బాడీబిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి బాడీబిల్డర్లు పాల్గొంటున్నారని కలెక్టర్‌కు విజయ్ కుమార్ వివరించారు.

మన బృందావనం

- పర్లాకిమిడి రాజుల సుందర స్వప్నం ..మెళియాపుట్టి వేణుగోపాలుని ఆలయం
- కట్టిపడేసే శిల్ప కళ ఆలయం సొంతం
- 7 నుంచి డోలోత్సవాలు ప్రారంభం

ఇప్పటికి దాదాపు 180 ఏళ్ల మునుపు.. మెళియాపుట్టిలో అందమైన మహేంద్ర తనయ నది ఒడ్డున ఏనుగులు బంకమట్టిని తొక్కుతూ కనిపించేవి. వందలాది మంది విశ్వ బ్రాహ్మణులు భారీ తలుపులు తయారు చేసేందుకు అహర్నిశలు శ్రమించేవారు. మతర గ్రామం నుంచి వచ్చిన శిల్పులు ప్రాకారాలు, ఆకారాల తయారీలో తలమునకలై కనిపించేవారు. వేద పండితులు నిత్యం మంత్ర పఠనం చేసేవారు. పది కిలోమీటర్ల దూరం నుంచి పర్లాకిమిడి మహారాజు, మహారాణి వచ్చి పనులు పర్యవేక్షించేవారు. ఇంతమంది శ్రమకు, స్వప్నానికి ప్రతి రూపం వేణుగోపాల స్వామి ఆలయం. ఉత్తరాంధ్రలోని అతి ప్రధాన ఆలయాల్లో ఈ ఆలయం కూడా ఒకటి. ఇక్కడి శిల్ప కళ, ఆలయ చరిత్ర అన్నీ విశిష్టమే.


వేణుగోపాల స్వామి(రాధాగోవింద స్వామి) ఆలయం



మెళియాపుట్టి: ఆంధ్రా, ఒడిశా పల్లెలు కవల పిల్లల్లా కలిసి కనిపించే ప్రాంతమది. తెలుగు, ఒరియా సంస్కృతులు పెనవేసుకుపోయి ఉంటాయి. ఇలాంటి సంగమ క్షేత్రంలో మహేంద్ర తనయ ఒడ్డున కనిపించే అతి సుందర ఆలయం మెళియాపుట్టి వేణుగోపాలుని కోవెల రాధాగోవింద స్వామి ఆలయం. పర్లాకిమిడి మహారాణి సుందర స్వప్నానికి ప్రతిరూపమిది. ఇక్కడి శిల్పకళను చూసేందుకు రెండు కళ్లు చాలవంటే అతిశయోక్తి కాదు. 1840లో పర్లాకిమిడి మహారాజు ప్రతాపరుద్రుని భార్య విష్ణుప్రియ మహారాణి కోరిక మేరకు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడి గర్భాలయంలో విగ్రహాలు కంచుతో తయారుచేసినవి. పర్లాకిమిడి నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహేంద్రతనయ నదీ తీరాన ఆలయాన్ని తీర్చిదిద్దారు. దీని నిర్మాణం కోసం మహారాణి తల్లిదండ్రులు పసుపుకుంకుమ కోసం ఇచ్చిన ఆభరణాలు, రూ.లక్ష వెచ్చించారు. ఇక్కడి గర్భగుడిలో ప్రతిష్ఠించిన మూలవిరాట్ విగ్రహాలను బృందావనం నుంచి తెప్పించినట్లు చరిత్ర చెబుతోంది.

సండే స్పెషల్

ఇలా నిర్మించారు..

అపురూప శిల్ప కళతో శోభిల్లే ఆలయ నిర్మాణం అంత ఆషామాషీగా జరగలేదు. పదిహేనేళ్ల పాటు ఆలయ నిర్మాణం జరిగింది. అప్పట్లో బరంపురం పట్టణానికి సమీపంలోని మతర అనే గ్రామానికి చెందిన శిల్పులతో ఇక్కడ శిల్పాలను చెక్కించారు.

ఆలయ నిర్మాణంలో తుమ్మబంకతో రాళ్లను అమర్చారు. ఏనుగులతో తొక్కించి తయారుచేసిన మిశ్రమాన్ని వాడటం వల్ల కట్టడం మరింత శోభ వచ్చింది. ఆలయంలో ఉన్న తలుపులు మైసూరు నుంచి తెప్పించారట. వందలాది మంది విశ్వబ్రాహ్మణులు ఆరేళ్ల పాటు తలుపులను తయారు చేశారని అంటారు.

నిర్వహణ ఇలా..

పర్లాకిమిడి రాజవంశస్తులకు రెండో ఎస్టేట్‌గా ఉన్న మెళియాపుట్టిలో 50 గ్రామాల నుంచి వచ్చిన ఫలసాయాన్ని ఆలయంలోని 30 గదుల్లో నిల్వచేసి అప్పట్లో 42 మంది అర్చకులు, 25 మంది పనివాళ్లకు జీతాలు చెల్లించేవారు. స్వామికి నిత్యధూప, దీప, నైవేద్యాలు సామంతులకు ఇక్కడి నుంచే చెల్లింపులు జరిపేవారు. ఆలయ పరిసరాల్లో ఉన్న సంపంగి, జామ, మామిడి, పూలతోటల్లోని పూలు, పళ్లతో అంగరంగ వైభవంగా పూజలను నిర్వహించేవారు. ప్రస్తుతం ఒక్క అర్చకుడు మాత్రమే ఉన్నారు.

సొరంగ మార్గం గుండా రవాణా..

ఆలయం నుంచి పర్లాకిమిడి బృందావన్ ప్యాలెస్‌గా పిలిచే రాజుల ఉద్యానవనానికి ఓ సొరంగ మార్గం ఉందని అంటారు. దీని ద్వారా ఫలసాయం, బంగారు నాణేలు రవాణా చేసేవారట. ఇప్పటికీ ఈ ఆనవాళ్లు ఉన్నాయి.



7 నుంచి డోలోత్సవాలు

ఏటా స్వామి డోలోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ 7వ తేదీ నుంచి జాతర ప్రారంభం కానుంది. ఉత్సవం ప్రారంభానికి ముందు రోజు రాత్రి రాజవంశీయులు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. తొమ్మిది రోజుల పాటు జరిగే డోలో యాత్రలో అనేక పౌరాణిక జానపద, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాలనుంచి యాత్రికులు పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు.



ప్రస్తుతం జీర్ణావస్థలో..

ఆలయం ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. శిల్పాలు, గదులు శిథిలమై కనిపిస్తున్నాయి. గతంలో పలుపూజా కార్యక్రమాలు, శుభ కార్యాలు చేసేటప్పుడు ఆయా గదుల్లో సామగ్రి నిల్వచేసి ప్రజలు సేద తీరేవారట. ప్రస్తుతం గదులన్నీ పిచ్చిమొక్కలతో అధ్వానంగా కనిపిస్తున్నాయి.


ఆలయంలో అపురూప శిల్పకళ

పోలింగ్‌కు సర్వం సిద్ధం


పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల మెటీరియల్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు నాలుగు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, పట్టభద్రుల శాసనమండలికి 59 కేంద్రాలు కలిపి 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 300 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని జిల్లా సంయుక్త కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలో పలు కేంద్రాల్లో స్ట్రాంగ్ రూమ్స్, పోలింగ్ మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి 52వేల మంది ఓటర్లు ఉన్నారని, స్థానిక సంస్థలకు 776 మంది ఓటర్లు ఉన్నారని జేసీ వెల్లడించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 38 మండలాల పరిధిలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారు. నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో స్థానిక సంస్థలకు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టభద్రుల శాసనమండలికి సంబంధించి ఓటర్లకు ఓటింగ్ స్లిప్‌ల పంపిణీ 40 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 60 శాతం మూడు రోజుల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని జేసీ నవీన్ అన్నారు. ఈ ఎన్నికలకు సుమారు 2వేల మంది సిబ్బందిని విధులకు వినియోగిస్తున్నామని తెలిపారు.

ముగిసిన క్రీడా పోటీలు


ఆటల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ టీం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ సాంబశివరావు అన్నారు. జిల్లా కేంద్రంలో గల వ్యవసాయ నైరా కళాశాల్లో గడిచిన మూడు రోజులుగా జరిగిన అంతర వ్యవసాయ పాలిటెక్నిక్ సంబంధిత కళాశాలల క్రీడలు పోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అలాగే విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ ఎం.శ్రీరేఖ విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను వ్యవసాయ పాలిటెక్నిక్ మార్టేరు సాధించింది. సాంస్కృతిక, సాహిత్య విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సంయుక్త విజేతలుగా వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కలికిరి, వ్యవసాయ పాలిటెక్నిక్ దర్శిలు నిలిచాయి. క్రికెట్‌లో విజేతగా పుంగనూరు, రన్నరప్‌గా రంపచోడవరం నిలిచాయి. వాలీబాల్‌లో విన్నర్స్‌గా అనకాపల్లి, రన్నర్స్‌గా కలికిరి విజయం సాధించారు. టేబుల్ టెన్నిస్‌లో విన్నర్‌గా మడకశిర, రన్నర్స్‌గా మార్టేరు, బ్యాడ్మింటన్ విన్నర్స్‌గా అనకాపల్లి, రన్నర్స్‌గా మార్టేరు, కేరమ్స్‌లో విన్నర్స్‌గా మడకశిర, రన్నర్స్‌గా అనకాపల్లి, చెస్‌లో విన్నర్స్‌గా అనకాపల్లి, రన్నర్స్‌గా ఘంటసాల విజయం సాధించారు.

చైతన్యం కావాల్సిన సమయమిదే

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా
- కిడ్నీ వ్యాధుల వైద్య శిబిరానికి విశేష స్పందన


రక్త పరీక్షల శిబిరానికి హాజరైన జనం (ఇన్‌సెట్‌లో) కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు

వజ్రపుకొత్తూరు: కిడ్నీ వ్యాధి బారిన పడకుండా అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం గ్రామంలో జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కిడ్నీ వ్యాధుల ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. పూండి ఉద్దానం ప్రాంతంలో 398 మంది వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అక్కడ ఉన్న వసతులను లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి సన్యాసినాయుడు, పలాస జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షితో కలిసి జిల్లా జడ్జి పరిశీలించారు. ఉద్దానం ప్రాంతం కోసం నిర్మాణమవుతున్న పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఓ వరం అని అన్నారు. వ్యాధి సోకకుండా చైతన్యం కావాల్సిన తరుణమిదే అని, ప్రతి ఒక్కరూ కిడ్నీలను కాపాడుకునేందుకు శారీరక శ్రమతో పాటు ఆహార నియమాలు పాటించాలన్నారు. వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పాలిన శ్రీనివాసరావు జడ్జి జునైద్ అహ్మద్ మౌలానాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 అవర్స్ పీహెచ్‌సీగా మార్చాలని, పీహెచ్‌సీకి రహదారి సౌకర్యం కోసం కృషి చేయాలని, తగిన సిబ్బంది నియమించాలని కోరారు. కార్యక్రమంలో నెఫ్రాలజీ విభాగం వైద్యులతో పాటు స్థానిక వైద్యులు సుధీర్, ప్రత్యూష, చలమయ్య, కనిష్క, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీడీఓ సీహెచ్.ఈశ్వరమ్మ, కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు, ఎస్ఐ వై.మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కుపల్లిలో..

వజ్రపుకొత్తూరు రూరల్: కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే వ్యాధి నియంత్రణ సాధ్యపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మండలంలోని అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని సీకేడీ(క్రానిక్ కిడ్నీ డిసీజ్) పరీక్షలు ధైర్యంగా చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ మీనాక్షి మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో సుమారు 7 లక్షల మంది జనాభా ఉండగా 5.70 లక్షల మందికి సీకేడీ పరీక్షలు యుద్ధ ప్రాతిపదికన చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 13,380 మంది సీకేడీతో బాధపడుతున్నట్లు గుర్తించామని కేవలం గత నెలలోనే మరో 70 కొత్త కేసులు నమోదయ్యాయన్నారు. సచివాలయ పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా 25 ఏళ్లు పైబడిన వారి రక్త నమూనాలను సేకరించి పీహెచ్‌సీల పరిధిలోనే వ్యాధి నిర్ధారణ చేస్తున్నామన్నారు. ప్రతి శనివారం పలాస సామాజిక ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టు అందుబాటులో ఉంటారని తెలిపారు. శిబిరంలో 307 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు.

అల్ట్రా పల్లెవెలుగు బస్సు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి ప్రారంభించిన అల్ట్రా పల్లెవెలుగు బస్సును సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ కోరారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం శ్రీకాకుళం–విశాఖ మధ్య నూతనంగా అల్ట్రా పల్లెవెలుగు బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో కె.సుబ్బారావు, ఎస్ఎం వి.శామ్యూల్, ఏడీసీ టి.రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఎయిమ్స్ డైరెక్టర్


ఆలయంలో ఎయిమ్స్ డైరెక్టర్ త్రిపాఠి బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ముకేష్ త్రిపాఠి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం స్థానిక వైద్యారోగ్యశాఖాధికారులతో కలిసి అరసవల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎయిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ రెడ్డి, ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ ఎన్.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి.. పింఛన్ అందించి..


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గిరీష్

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ గ్రామ సచివాలయం-1కు చెందినవలంటీర్ యర్నాగుల గిరీష్ హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేశారు. టెక్కలి రేవతిపతి వీధికి చెందిన ఉప్పాడ రామారావు దివ్యాంగుడు. ఆయన భార్య ఉప్పాడ పార్వతిదేవి వృద్ధురాలు. అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లారు. పింఛన్ అందజేసే సమయం కావడంతో గ్రామ వలంటీర్ గిరీష్ హైదరాబాద్ వెళ్లి ఇరువురికి పింఛన్లు అందజేశారు.

జీడితోటలు దగ్ధం


కాలిపోయిన జీడితోట

సంతబొమ్మాళి: మండలంలోని ఆకాశలక్కవరం పంచాయతీ సీరపువానిపేట పరిధిలో శనివారం జీడితోట దగ్ధమైంది. 50 సెంట్ల తోట కావడంతో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. స్థానికులు నీటి ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మేఘవరంలో 10 ఎకరాల జీడితోట దగ్ధం కాగా సుమారు రూ.20లక్షలు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. వ్యవసాయాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పన్ను బకాయిలు చెల్లించండి


మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఆర్‌డీ నాగరాజు

ఆమదాలవలస: పురపాలక సంఘానికి బకాయి పడిన పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విశాఖపట్నం రీజియన్ పురపాలక ప్రాంతీయ సంచాలకుడు పి.నాగరాజు కోరారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న పన్నుబకాయిలతో అభివృద్ధికి విఘాతం కలుగుతోందన్నారు. వేసవి తాగునీటి ఎద్దడిపై తీసుకోనున్న కార్యాచరణను మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడుని అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, వీధిలైట్ల నిర్వహణ పక్కాగా చేపట్టాలని, ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై విమర్శలకు తావులేకుండా నిబంధనల మేరకు చ ర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక కంపోస్ట్ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ బి.సృజన తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్


బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

లెక్కల చిక్కులు తేలుస్తూ..!


గణిత దశావధానం ప్రక్రియలో పాల్గొన్న అవధాని మద్దు తిరుపతిరావు

- గణిత బోధనలో రాణిస్తున్న మద్దు తిరుపతిరావు మాస్టారు
- విద్యార్థుల్లో మ్యాథ్స్‌పై భయం పోగొట్టేందుకు కృషి
- రాష్ట్ర వ్యాప్తంగా 205 చోట్ల గణిత అవధాన ప్రదర్శనలు


150 సంవత్సరాల క్యాలెండర్

కంచిలి: సాధారణంగా విద్యార్థులకు లెక్కలంటే భయం. మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తున్నా.. గణితంలో మాత్రం లేనిపోని ఆందోళనతో వెనుకబడిపోతుంటారు. ఇలాంటి వారిలో భయం పోగొట్టేందుకు, సులువుగా గణిత సమస్యలు అర్థమయ్యేలా చిట్కాలను కనుగొని తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన మద్దు తిరుపతిరావు మాస్టారు. ప్రస్తుతం జలంత్రకోట పంచాయతీ చొౌత్రాయిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఖాళీ సమయాల్లో గణిత అవధాన ప్రక్రియ ప్రదర్శనలిస్తూ గణిత సేవలో తరిస్తున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తిరుపతిరావు మచిలీపట్నంలోని ఏజే కళాశాలలో బీఈడీ చదువుతున్నప్పుడు అక్కడి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.ఎన్.శాస్త్రి వద్ద శిష్యరికం చేసి గణితంపై పట్టు సాధించారు ఆయన వద్దే అవధాన ప్రక్రియ నేర్చుకున్నారు.

అనేక అవార్డులు..

- తిరుపతిరావుకు నియోజకవర్గ స్థాయిలో 'జ్ఞానదీప్తి' అవార్డు, గణిత చాణుక్య అవార్డు, గణిత మిత్ర అవార్డులు వరించాయి. 5 వేల సంవత్సరాల క్యాలెండర్‌ను రూపొందించి గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డుకు పంపించగా సభ్యత్వాన్ని కేటాయించారు.
- దివంగత సర్దార్ గౌతు లచ్చన్న స్మారక అవార్డును అప్పటి మాజీ కేంద్ర మంత్రి, దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు చేతులమీదుగా అందుకున్నారు.
- ఇటీవల మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతులమీదుగా 10 సంవత్సరాల క్యాలెండర్‌ను ఆవిష్కరించి, అభినందనలు అందుకున్నారు.


పాగిరిలో నిర్వహించిన దశావధానం ప్రక్రియకు గుర్తుగా జ్ఞాపిక

గణిత అవధానం అంటే..

తెలుగు అవధానం మాదిరిగానే గణితావధానం ప్రక్రియ ఉంటుంది. ఇందులోనూ 8 మంది పృచ్ఛకులు ఉంటారు. వీరు అడిగిన ప్రశ్నలకు అవధాని టక్కున సమాధానం చెబుతుంటారు. గణిత శాస్త్రంలో అపరిమితమైన ప్రశ్నలకు చమత్కారంగా, వేగంగా సమాధానాలు చెబుతుంటారు. మూలాలు సాధన, సమస్యా పూరణం, పంచమ మూలకం, వారగణన, దత్తభిన్నాంకం, వర్గాల బేధంగా చెప్పడం, మనోగుణకారం వంటి వివిధ అంశాలు ఉంటాయి.

205 ప్రదర్శనలు..

తిరుపతిరావు అవధాన ప్రక్రియ నిర్వహిస్తూ విద్యార్థులను పృచ్ఛకులుగా తయారు చేసి ప్రదర్శనలివ్వడం ప్రారంభించారు. 8 అంశాలపైన గణిత అష్టావధానం, 10 అంశాలపైన గణిత దశావధానం, 12 అంశాలతో గణిత ద్వాదశావధానం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 205 ఉచిత ప్రదర్శనలిచ్చారు. దూరదర్శన్, వివిధ టీవీ చానల్స్‌లోనూ గణిత దశావధానం నిర్వహించారు.

వినూత్నంగా..

గణితంతో గారడీలు, గణిత విన్యాసాలు, గణిత క్రికెట్, గణిత వైకుంఠపాళి, గణిత గుర్తులతో తమాషా కథలు, గణిత గేయాలు, గణిత నాటికలు, అంకెలతో ఆటలు, మెదడుకు పదును,గణిత చిట్కాలు, విభిన్నం క్యాలెండర్లు తయారు చేయడంలో తిరుపతిరావు ప్రత్యేకత చాటుకుంటున్నారు. ప్రతి ఏడాది నూతన సంవత్సరం రోజున తాను తయారు చేసిన క్యాలెండర్లనే గ్రీటింగ్ కార్డుల మాదిరిగా శ్రేయోభిలాషులకు అందజేస్తుంటారు. శ్రీనివాస రామానుజన్ గణిత క్లబ్‌ను స్థాపించి జిల్లాస్థాయిలో గణిత ప్రతిభా పోటీలు, మండల స్థాయిలో గణిత పరిశోధన పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 9 మంది విద్యార్థులను బాలమేధావులుగా తయారు చేసి, వారితో ప్రదర్శనలు ఇప్పించారు.ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు డీఆర్‌పీగా వ్యవహరిస్తున్నారు.

గణితంపై భయం పోగొట్టడమే లక్ష్యం..



విద్యార్థుల్లో గణితం అంటే ఉన్న భయాన్ని దూరం చేయడమే లక్ష్యం. పది మంది బాలమేధావులను తీర్చిదిద్ది వారితో సైతం ప్రదర్శనలిస్తున్నాం. గణిత సమస్యలపై మరిన్ని పరిశోధనలు చేసి అందరికీ సులువుగా అర్థమయ్యేలా బోధన సాగిస్తాను.

– మద్దు తిరుపతిరావు, గణితావధాని, హెచ్‌ఎం, చొౌత్రాయిపురం ప్రాథమికోన్నత పాఠశాల

ప్రతీ పైసా చెల్లిస్తాం


సత్యవరం సచివాలయంలో సిబ్బంది పనితీరు పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వెల్లడి

నరసన్నపేట: ప్రభుత్వ భవనాలతో పాటు సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలు ఇలా ప్రభుత్వం మంజూరు చేసిన ఏ భవనం నిర్మించినా ప్రభుత్వం పైసలతో సహా చెల్లిస్తుందని, బిల్లుల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. వారం రోజుల్లో రూ.28 కోట్ల బిల్లులు ఖాతాల్లో పడనున్నాయని స్పష్టం చేశారు. నరసన్నపేట మండలం సత్యవరం, మాకివలసల్లో సచివాలయాలను శనివారం సందర్శించారు. ఎంపీపీ ఆరంగి మురళి, దేవాది, దూకులపాడు సర్పంచ్‌లు మంతిన రాము, అల్లు అశిరినాయుడు, కోమర్తి వైఎస్సార్ సీపీ నాయకులు ఉంగటి రాజు మాట్లాడుతూ తాము భవనాలు నిర్మించినా బిల్లులు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బిల్లులు ఇప్పటికీ చెల్లిస్తున్నామని, ప్రాధాన్యతల బట్టి అన్ని బిల్లుల చెల్లింపు జరుగుతుందని, ఒకటి రెండు నెలల జాప్యం జరిగినా ఆందోళన చెందవద్దని చెప్పారు. అంతకు ముందు సచివాలయ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. వీఏఏ, డిజటల్ అసిస్టెంట్ల పనితీరును ప్రశించారు. సర్వే రాళ్లు వేసే ప్రక్రియ తొందరగా పూర్తి చేయాలని, కూలీలకు డబ్బులు వెంటనే ఇవ్వాలని తహసీల్దార్ సింహాచలాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదనరావు, ఈఓ సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సిద్ధంకావాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: హక్కుల సాధనకు ఉద్యోగులు సిద్ధం కావాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, శ్రీకాకుళం జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ వసతి గృహంలో అమరావతి జేఏసీ, రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వస్తోందని చెప్పారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 3 వరకు దశల వారీగా పోరాటాలు చేస్తామని తెలిపారు. ఇది ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటం కాదని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న పోరాటమని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీని జీతాలు/పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘాలతో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగి ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు డి.జి.ప్రసాదరావు, అంజనీ కుమార్, పి.లక్ష్మణరావు, ఎస్.వి.రమణ, పి.వేణుగోపాలరావు, పి.శ్రీనివాసరావు, బి.వి.వి.ఎస్.రాజు, ఎన్.గోవిందరావు, డి.పి.దేవ్, పి.పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఐక్యనినాదం చేస్తున్న జేఏసీ నాయకులు

సగటు వేతనం పెంపులో నిర్లక్ష్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సగటు వేతనం పెంపులో సిబ్బంది నిర్లక్ష్య ధోరణి సరికాదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టి రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని డ్వామా కార్యాలయంలో శనివారం కొత్తూరు మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో సగటు వేతనం చాలా తక్కువగా ఉందని, పరిస్థితి మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు సామాజిక తనిఖీ డీఆర్పీలు మండలంలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను తాము నిర్వహించిన తనిఖీల నివేదికలను చదివి వినిపించారు. వేతనాల రూపంలో రూ 9.36 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ నిమిత్తం రూ.7.04 కోట్లు వెరసి రూ 16.40 కోట్లు మండలంలో ఖర్చు జరిగినట్లు వివరించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ సామాజిక నివేదికల ప్రాప్తికి విచారణ జరిపి నిధులు రికవరీ చేయడంతో పాటు అవసరమైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మస్టర్ షీట్లలో ఎటువంటి దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. పోయిన మొక్కల స్థానంలో తక్షణమే కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీ పి.రాధా, హెచ్ఆర్ మేనేజర్ పి.శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ పావని, ఎస్ఆర్‌పీ సింహాద్రి, ఏవీఓ సురేష్ కుమార్, ఏపీఓ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల కల్పనే లక్ష్యం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యలో నైపుణ్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన ప్రేరణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్స్ ఉన్న విద్యార్థులకే మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. పోటీ తత్వంతో చదువుతూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విష్ణుమూర్తి, భైరాగిరెడ్డి, పాంగు రంగారెడ్డి, రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్, అసిస్టెంట్ ఆర్.శ్రీధర్ పాల్గొన్నారు.

మలేషియాలో సిక్కోలు యువకుడు ఆత్మహత్య

- ఆరు నెలల కిందట ఉపాధి కోసం వెళ్లిన విజయకుమార్
- పని లభించకపోవడంతో బలవన్మరణం


బడ్డ విజయ కుమార్ (ఫైల్)

నరసన్నపేట: డిగ్రీ వరకూ చదువుకుని, దళారుల మాట నమ్మి మలేషియా వెళ్లిన సిక్కోలు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నరసన్నపేట మండలం బాలసీమకు చెందిన బడ్డ విజయకుమార్ తాను అద్దెకు ఉంటున్న గదిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం అతని కుటుంబసభ్యులకు సమాచారం అందింది. దీంతో తల్లిదండ్రులు బడ్డ కొండాలమ్మ, వెంకటరమణలు కన్నీరుమున్నీరయ్యారు.

విజిటింగ్ వీసాతో ఆరు నెలల కిందట విజయ్ కుమార్ మలేషియా వెళ్లాడు. అయితే అనుకున్న విధంగా అతనికి అక్కడ పని లభించలేదు. దీంతో ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అతను మలేషియా వెళ్లేందుకు చేసిన అప్పులు కూడా ఇంకా తీర్చలేదని, ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదని తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. కుమారుడిని చివరి సారి చూసేందుకు ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని, మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలని కోరుతున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు రఘుపాత్రుని శ్రీధర్, ఆరంగి శ్రీను తదితరులు పరామర్శించారు.


రోదిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు

పకడ్బందీగా ప్రాక్టికల్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. రెండో విడతగా జిల్లాలో 76 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం, మధ్యాహ్నం 8142 మందికి గాను 7918 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకుడు, ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, డీఈసీ కమిటీ సభ్యులు, హెచ్‌పీసీ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాల్లో తనిఖీలు జరిపారు. సీసీ కెమెరాల స్ట్రీమింగ్ ద్వారా బోర్డు ఉన్నతాధికారులు, ఆర్ఐఓ కార్యాలయంలో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.


శ్రీకాకుళంలో ఓ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీవీఈఓ ప్రకాశరావు

తెగుళ్ల నివారణ కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యవసాయం లాభసాటి కావాలంటే మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలని, తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని ఆమదాలవలసకు చెందిన కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మౌనిక అన్నారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరం పంచాయతీ రామజోగిపేటలో శనివారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించి పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్ర పురుగుల రక్షణపై దృష్టి సారించాలన్నారు. పంటలో పసుపు పళ్లేలు ఏర్పాటు చేయడంవల్ల శత్రుపురుగ్గును నియంత్రించవచ్చునని చెప్పారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ ఏడీఏ బి.రజని, రైతు శిక్షణ కేంద్రం ఏఓ సూర్య కుమారి, మండల వ్యవసాయాధికారి వై.సురేష్, ఏఈఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


రామజోగిపేటలో పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

పారిశ్రామిక ప్రాంతానికి ప్రత్యేక విద్యుత్ సెక్షన్

అరసవల్లి: జిల్లాలో ప్రధాన పారిశ్రామిక వాడగా గుర్తింపు ఉన్న పైడిభీమవరంలో విద్యుత్ పరమైన సమస్యలకు ఇకమీదట చెక్ పడనుంది. ఈ మేరకు ఇక్కడ కొత్తగా విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు చేస్తూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

20కి పైగా భారీ ఫార్మా పరిశ్రమలు, ఇతరత్రా కంపెనీ కార్యాలయాలున్న ఈ ప్రాంతంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న కారణంగా పైడిభీమవరం కేంద్రంగా కొత్తగా సెక్షన్ ఏర్పాటు చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో పైడిభీమవరం సెక్షన్ ఏర్పాటుతో మొత్తం 44 సెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాతర్లపల్లి, పైడిభీమవరం, కోష్ట సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఈ కొత్త సెక్షన్ సేవలందించనుంది. దీనిపై విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ మాట్లాడుతూ.. పైడిభీమవరానికి కొత్త సెక్షన్ మంజూరైందని, ఇక్కడ ఏఈ పోస్టును కూడా భర్తీ చేశామని స్పష్టం చేశారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని కిష్టుపురం మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.1270 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. వీరిని అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'మెనూ అమలు చేయడం లేదు'

పాతపట్నం: తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ సరిగ్గా అమలు చేయడం లేదని విద్యార్థులు ఏబీవీపీ కన్వీనర్ కే.మురళి అన్నారు. శనివారం తెంబూరు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ విషయమై హెచ్ఎం ఎ.రమేష్‌ను వివరణ కోరగా టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు పెడుతున్నందున కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

బూర్జ : నీలాదేవిపురం గ్రామానికి చెందిన జమ్మాన ప్రసన్నకుమార్ ఓవీపేట పరిధిలోని తోటలో అనుమానాస్పద రీతిలో మృతి సంగతి తెలిసిందే. పోలీసులు 11 మంది అనుమానితులను విచారించి ఓవీపేటకు చెందిన అన్నెపు రమణమూర్తిని నిందితుడిగా గుర్తించారు. దిశ డీఎస్పీ ఎస్.వాసుదేవరావు ఆధ్వర్యంలో శనివారం అదుపులోకి తీసుకుని జిల్లా ఎస్పీ, ఎస్టీ కోర్టులో హాజరుపర్చినట్లు బూర్జ ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. కోర్టు రిమాండ్ విధించిందని పేర్కొన్నారు.